కృష్ణ యాతీంద్ర రామానుజ జీయర్ కన్నుమూత

- 11 మంది జీయర్‌స్వాముల్లో ఒకరు
- అంత్యక్రియలకు హాజరైన శిష్యులు, పూర్వాశ్రమ కుటుంబ సభ్యులు

త్రిదండి శ్రీకృష్ణ యాతీంద్ర రామానుజ జీయర్‌స్వామి(ఫైల్)

కమాన్‌చౌరస్తా, జూలై 13: నగరంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెట్‌పల్లికి చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీకృష్ణ యాతీంద్ర రామానుజ జీయర్‌స్వామి(89) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. దేశ వ్యాప్త విశిష్టాద్వైత జీయర్ స్వాములు 11 మందిలో ఆయన ఒకరు. పూర్వాశ్రమంలో ఆయన పేరు కల్వకుంట కృష్ణమాచార్యులు. తల్లిదండ్రులు కల్వకుంట ఆండాళమ్మ, వేదాంతాచార్యులు. ఆయనకు భార్య గోపాలారుక్మిణితో పాటు నలుగురు కుమారులు శ్రీమన్నారాయణాచార్యులు(ఆయుర్వేద వైద్యుడు), సింహాద్రి ఆచార్యులు(జ్యోతిషరంగం), జగన్నాథాచార్యులు(విశ్రాంత న్యాయవాది), రామకృష్ణ (ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్) ఉన్నారు. హిందీ, ఇంగ్లిష్, సంస్కృత భాషలతో పాటు జ్యోతిషంలో గొప్ప ప్రతిభ కలిగి పలు గ్రంథాలను రచించారు. యథార్థ మానవత్వం, రంగనాథ శతకం, కొండగట్టు ఆంజనేయస్వామి శతకం, ఆళ్వార్ వైభవం, నిత్య ధార్మిక సాహిత్య జీవితం పుస్తకాలను రచించారు. 2004లో కృష్ణమాచార్యులు సన్యాసాశ్రమం స్వీకరించారు. శ్రీవిల్లిపుత్తూరు ఆండాల్ క్షేత్రానికి, తిరుమల అన్నప్రసాద వితరణకు, బదరీ క్షేత్ర యాత్రికుల హాస్పిటల్ నిర్మాణం కోసం విరాళాలను అందించారు. సుల్తానాబాద్ మండల నీరుకుళ్లలో రంగనాయక స్వామి వెలసిన మానేరు నది ఒడ్డున యతీశ్వర సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ యాతీంద్ర రామానుజ జీయర్‌స్వామిని ఖననం చేశారు. ఆయన మృతికి చినజీయర్‌స్వామి, అహోబిల రామానుజ జీయర్‌స్వామి, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి సంతాపం ప్రకటించారు. సాహితీవేత్తలు డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశం, బుర్ర మధుసూదన్‌రెడ్డి, నమిలకొండ రమణాచార్యులు, ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత, తదితరులు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'దళిత బంధు' రెండో విడుత నిధులివ్వాలి

- లేకపోతే దళితులతో కలిసి ఉద్యమిస్తాం
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

మాట్లాడుతున్న బండ శ్రీనివాస్

హుజూరాబాద్ రూరల్, జూలై 13: పేద దళితులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకం కింద లబ్ధిదారులకు రెండో విడుతలో డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హుజూరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 18,021 దళిత కుటుంబాలు పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. లబ్ధిదారులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత బంధు మొదటి విడుతగా రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించగా, ఇందులో కొందరు వాహనాలు కొనుగోలు చేయగా, మరికొంత మంది షాపులు, డెయిరీ ఫామ్స్ ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. 2023 అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావడం వల్ల ఈ పథకానికి సంబంధించిన రెండో విడుత డబ్బులను ఎలక్షన్ కమిషన్ ఆపేసిందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా కనీసం రెండో విడుత డబ్బులు సైతం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి దళిత బంధు రెండో విడుతను విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. లేకపోతే దళితులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మోరె మధు, మంద రాజేశ, శంకర్, చంద్రమౌళి, రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల కోసం ప్రజాఉద్యమం

- సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి

తెలంగాణచౌక్, జూలై 13: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల కోసం ప్రజా ఉద్యమం చేపడుతామని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో శనివారం నిర్వహించిన నగర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ, ఆరు మాసాల పాలన పూర్తి అయినా మాట నిలుపుకోలేదని దుయ్యబట్టారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణం తప్ప మిగతా గ్యారెంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రూ.500కు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందక పోవడంతో ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. మున్సిపల్‌లోనే కాకుండా ప్రతి వార్డులో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు రూ.2500 బ్యాంక్ ఖాతాలో వేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఒక్క మహిళకు కూడా డబ్బులు అందలేదన్నారు. కళ్యాణలక్ష్మి పథకం ఊసే లేదని, అసలు ప్రభుత్వ పాలన ఉందో లేదో ప్రజలకు తెలియడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం ప్రజలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నగరం సహాయక కార్యదర్శి పైడిపల్లి రాజు, కౌన్సిల్ సభ్యులు మల్లమ్మ, సదానందం, మురళి హేమంత్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంపల్లి అరవింద్

శంకరపట్నం, జూలై 13: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సరిపడా నిధులు లేనందున నాణ్యమైన భోజనం వడ్డించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలని కోరారు. విద్యాధికారులు పాఠశాలలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినయ్, నాయకులు కార్తీక్, తిరుమలేశ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు ఆపాలి

తిమ్మాపూర్, జూలై13: రేణికుంట శివారులో మోయతుమ్మెద వాగులో ఇసుక తవ్వకాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. శనివారం తిమ్మాపూర్‌లో ఆయన మాట్లాడారు. ఇసుక తవ్వకాలతో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటిపోయాయని, వాగుపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా వ్యాపారులు, కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ రైతులకు నష్టం చేస్తున్నదన్నారు. తవ్వకాలను అడ్డుకున్న రేణికుంట రైతులు, యువకులకు పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. తవ్వకాలు ఆపకుంటే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మండల కార్యదర్శి మాతంగి శంకర్, నాయకులు కసాడి పవన్, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థి

ఓం ప్రకాశ్

మానకొండూర్ రూరల్, జూలై 13: అన్నారం గ్రామానికి చెందిన రొడ్డ ఓం ప్రకాశ్ ఐబీపీఆర్ (ఆర్‌ఆర్‌బీ) పరీక్షలో ఉత్తీర్ణుడై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో క్లర్క్ ఉద్యోగం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి ఆయన ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్ తీసుకొని పరీక్షకు సన్నద్ధమయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా ఓం ప్రకాశ్‌ను శనివారం డీడీ హమీద్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

ఘనంగా గోరింటాకు మహోత్సవం

శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయంలో గోరింటాకు మహోత్సవం పాల్గొన్న మహిళలు

చొప్పదండి, జూలై 13: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. శ్రీగౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం మహిళలు చేతులను గోరింటాకుతో అలంకరించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొడిగె వెంకన్న, ఎలిగేటి రాములు, కోశాధికారి దండె సత్యానందం, సభ్యులు దండె రవీందర్, కట్ట సత్యం, పిట్టల మల్లేశం, పిట్టల సత్యం, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను దుర్వినియోగం చేయవద్దు

- ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్

తెలంగాణచౌక్, జూలై 13: ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని అపార ఖనిజ సంపదను ప్రభుత్వాలు దుర్వినియోగం చేయవద్దని ప్రొఫెసర్, ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్ సూచించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర తెలంగాణలో ఉన్న ఖని సంపదను ఇక్కడి ప్రజల అవసరాలు తీర్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణలో గల కోటి జనాభా జీవనోపాధి అవసరాలకు కోసం ఇక్కడి ఖనిజ సంపదను ఉపయోగించాలన్నారు. బొగ్గు, మాంగనీస్, సున్నపురాయి లాంటి ఖనిజ సంపదకు ఉత్తర తెలంగాణ నిలయమని పేర్కొన్నారు. బొగ్గు నిక్షేపాలు ఉన్న వద్దే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించి ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఉన్న భూములకు సాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తర తెలంగాణకు అన్యాయం జరిగితే ఉపేక్షించబోమని, మరో మహా తెలంగాణ పోరు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అన్నబోయిన ప్రశాంత్, శ్రీనివాస్, కడారి ఐలయ్య, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

పదవి బాధ్యతలు చేపట్టిన ది అర్బన్ బ్యాంక్ కరీంనగర్ నూతన పాలకవర్గ సభ్యులు

కార్పొరేషన్/ విద్యానగర్, జూలై 13 : కరీంనగర్ అర్బన్ బ్యాంక్ సీఈవో ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నూతన పాలకవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. నూతన పాలకవర్గ నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఖాతాదారులు, సిబ్బంది సహకారంతో బ్యాంకును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మూడు నెలల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డివిడెంట్ ఫండ్ విడుదలకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గంగాధర నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంతో పాటు కరీంనగర్ మెయిన్ బ్రాంచ్ పరిధిలో ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. నూతన పాలకవర్గ సభ్యులైన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ కలీం ఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మి రవీందర్ రెడ్డి, ఏ. విద్యాసాగర్, ఇ. లక్ష్మణ్ రాజు, ఎండీ. సమియొద్దీన్, మంగి రవీందర్‌ను అర్బన్ బ్యాంక్ సిబ్బంది శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రెహమాన్, కామిడి రామిరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, సర్దార్ దన్నసింగ్, పోరాండ్ల రమేశ్, ఎండీ ఆమీర్, మూల జైపాల్, గంగుల దిలీప్, రాజ్‌కుమార్, కుర్ర పోశయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పాంద్రాల లింగమూర్తి, అస్తపురం రమేశ్, జ్యోతి, ఎండి.ఇమ్రాన్, శాన వాజ్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

కేశవపట్నం 14వ వార్డులోని సామల మార్కండేయ ఇంటి వద్ద చెత్తాచెదారంతో నిలిచిన మురుగునీరు

'పేరు గొప్ప.. ఊరు దిబ్బ..' అన్న చందంగా ఉంది మండల కేంద్రంలో పారిశుధ్య పరిస్థితి. డ్రైనేజీ లేక జనావాసాల మధ్య మురుగు నీరు నిలుస్తుండడంతో రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారికి ఒకవైపు డ్రైనేజీ నిర్మించినా, కొలతల వివాదాలతో మరోవైపు ఆదిలోనే హంసపాదులా మిగిలింది. ప్రస్తుతం ఈ రోడ్డుకు రెండు వైపులా మొత్తం జనావాసాలు విస్తరించాయి. దీంతో డ్రైనేజీ లేని వైపు మురుగునీరు ఇండ్ల మధ్య నిలుస్తున్నది. వర్షాకాలం వచ్చిందంటే చెత్తాచెదారం, వ్యర్థాలతో కూడి కంపు కొడుతున్నది. పందులతో పాటు ఈగలు, దోమలు బెడద పెరుగుతుండడంతో రోగాలకు నిలయంగా మారుతున్నది. అధికారులు, పాలకులు ఇప్పటికైనా సమస్య తీవ్రతను గుర్తించి, రోడ్డుకు రెండు వైపులా పూర్తి డ్రైనేజీని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- శంకరపట్నం, జూలై 13

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై తనిఖీలు

తనిఖీలు చేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

కార్పొరేషన్, జూలై 13: నగరపాలక సంస్థ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న దుకాణాల్లో శనివారం పారిశుధ్య విభాగం సిబ్బంది తనిఖీలు చేశారు. నగరంలోని కశ్మీర్‌గడ్డ, రాంనగర్ తదితర ప్రాంతాల్లో వివిధ షాపుల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను గుర్తించి సీజ్ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను ఎవరూ వినియోగించవద్దని అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సింగిల్ యూజ్ కవర్ల వల్ల పారిశుధ్య ఇబ్బందులు ఎక్కువగా వస్తాయని, ప్రజలు వీటి వినియోగం మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.

NT-339536

PLOT FOR SALE

★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.

NT-327686

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిగురుమామిడి, జూలై 13: మండలంలోని కొండాపూర్, నవాబ్‌పేట, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, రామంచ, ముల్కనూర్, పీచుపల్లి, సీతారాంపూర్, లంబాడి పల్లె, ఓగులాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు గానూ రూ.10.61 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తిరుపతి రెడ్డి వెల్లడించారు. చెక్కుల మంజూరుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్ కుమార్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, మండల ఉపాధ్యక్షుడు ఠాగూర్ నరేందర్ సింగ్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఎండీ షాబుద్దీన్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు కాంతాల మైపాల్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, మీడియా మండల కన్వీనర్ బోయిని వేణుగోపాల్, గ్రామాల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య, నరేందర్, అనిల్, సంపత్ రెడ్డి, వేణుగోపాల్, మల్లారెడ్డి, వెంకన్న, సంపత్, బాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

గట్టుదుద్దెనపల్లిలో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్ రూరల్, జూలై 13: మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీ ఘటనలు పెరుగుతుండడంతో విద్యుత్ అధికారులు బెంబేలెత్తుతున్నారు. గట్టుదుద్దెనపల్లిలో శనివారం తెల్లవారు జామున ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అలాగే 11వ తేదీన నిజాయితీ గూడెం నుంచి గట్టుదుద్దెనపల్లి వరకు ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, 6న గట్టుదుద్దెనపల్లి నుంచి కెనాల్‌పల్లికి వెళ్లే దారిలో ఉన్న దాదాపు ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌ను ఎత్తుకెళ్లారని ఏఈ రమేశ్ తెలిపారు. వరుస దొంగతనాలతో అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించాలంటే కష్టతరమవుతున్నదని పేర్కొన్నారు. రాగి తీగ చోరీలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉంది.

డీఎస్సీ పరీక్ష కేంద్రాలు

కమాన్‌చౌరస్తా, జూలై 13: ఈ నెల 18 నుంచి ఆగస్టు 8 తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయని డీఈవో జనార్దన్‌రావు ప్రకటనలో తెలిపారు. జగిత్యాల రోడ్‌లో గల అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల, ఎల్‌ఎండీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కాలేజీ, జ్యోతినగర్‌లోని వాణి కేతన్ డిగ్రీ, పీజీ కళాశాల, వివేకానంద డిగ్రీ, పీజీ కాలేజీతో పాటు సింగపూర్ (హుజూరాబాద్) కిట్స్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేత్రదానం

కరీంనగర్ రూరల్, జూలై 13: బొమ్మకల్ గ్రామంలోని కృష్ణానగర్‌కు చెందిన పోలాడి సాయి కుమార్ (26) శుక్రవారం కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతడి కోరిక మేరకు కుటుంబ సభ్యులు నేత్రాలు దానం చేశారు. నేత్ర వైద్యశాల వైద్యులు.. సాయికుమార్ నేత్రాలను సేకరించి, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు. కార్యక్రమంలో అతడి తండ్రి మహేందర్, కుటుంబ సభ్యులతో పాటు ఇంజినీర్ కోల అన్నారెడ్డి, చింతల కిషన్, ఎలగందుల నందకుమార్, దేవరకొండ అజయ్, మామిండ్ల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

తెలంగాణచౌక్, జూలై 13: కరీంనగర్ బస్టాండ్‌లో అనూష అనే ప్రయాణికురాలు శనివారం బ్యాగ్ మరిపోగా, గమనించిన సెక్యూరిటీ గార్డు కవిత స్టేషన్ మేనేజర్ అంజయ్యకు అప్పగించింది. ఆయన బ్యాగ్‌లో ఉన్న ఆధారాలతో అనూషకు సమాచారం అందించి ఆమెకు అప్పగించారు. బ్యాగ్‌లో రెండు సెల్‌ఫోన్లు, రూ.1600 నగదుతో పాటు విలువైన పత్రాలు ఉన్నాయని, తిరిగి బ్యాగ్ అప్పగించిన ఆర్టీసీ సిబ్బందికి అనూష కృతజ్ఞతలు తెలిపింది.

ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన అధికారులు

శంకరపట్నం, జూలై 13: కేశవపట్నం బస్టాండ్‌ను శనివారం హుజూరాబాద్ ఇన్‌చార్జి డీఎం వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ సారయ్యతో కలిసి బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌కు ముందు భాగంలో గల ఖాళీ ప్రదేశాన్ని ఇటీవల పంచాయతీరాజ్ అధికారులు చదును చేసి మొరంతో నింపుతున్నారు. ఆ స్థలం గుండా వారసంతకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఆ స్థలం తమకు చెందినదని, దానిని గ్రామ పంచాయతీ అధికారులు ఎలా చదును చేస్తారని అధికారులు అన్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి డీఎం ఎంపీడీవో శ్రీవాణిని ఫోన్‌లో సంప్రదించారు. అది తమ స్థలమే అని ఎంపీడీవో పేర్కొన్నట్లు తెలిపారు. అయితే సర్వే కోసం ఉన్నతాధికారులకు రెఫర్ చేస్తామని ఆయన వెల్లడించారు.

గౌడ సంఘం మండల కమిటీ ఎన్నిక


తిప్పని సమ్మయ్యకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్

వీణవంక, జూలై 13: సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా తిప్పని సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా రమేశ్, సదానందం, మొగిలి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శిగా ఎల్లయ్య ఎన్నికయినట్లు జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారు సంఘం అభ్యున్నతి కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, గీతకార్మికులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కోరుట్ల, జూలై 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, కార్మిక సంఘం నేత బాలరాజు కోరారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో శనివారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులకు అనేక వాగ్దానాలు చేసినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. సమావేశంలో నాయకులు బోగ గోవర్ధన్, ముక్రం, మౌలానా, కడారి రాములు, కొక్కుల శాంత, అనసూయ, రంగారెడ్డి, లక్ష్మణ్, వేణు, భానుప్రసాద్, దేవదాసు, ఎన్నం రాధ, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స

కరీంనగర్ రూరల్, జూలై 13: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, బొమ్మకల్ లయన్స్ క్లబ్ సభ్యుడు చింతల కిషన్‌పటేల్, జోన్ చైర్ పర్సన్ రీజియన్ 8 జోన్ 2 లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి హాస్పిటల్‌లో ఇద్దరికి ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్స అందించారు. బొమ్మకల్ గుంటూర్‌పల్లె గ్రామానికి చెందిన నూకల రాజమల్లు, కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కొత్త రామలక్ష్మికి రేకుర్తి కంటి వైద్యశాల చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్, ట్రస్ట్ మెంబర్ కోలా అన్నారెడ్డి సహకారంతో శస్త్ర చికిత్స చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ టెక్నీషన్ చింతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉచిత కంటి శస్త్ర చికిత్సకు సహకారం అందించిన సిబ్బందికి చింతల కిషన్ ధన్యవాదాలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంకలో పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని చూపిస్తున్న ఎస్‌ఐ తోట తిరుపతి

వీణవంక, జూలై 13: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తోట తిరుపతి శనివారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొనుక్కొని వెళ్తున్న సుల్తానాబాద్‌లోని మార్కండేయ కాలనీకి చెందిన చింతల కిరణ్‌ను మామిడాలపల్లి శివారులో పట్టుకున్నట్లు వివరించారు. 15 క్వింటాళ్ల బియ్యంతోపాటు ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గన్నేరువరం, జూలై 13: మండలంలోని గునుకుల కొండాపూర్, చీమలకుంటపల్లి గ్రామాల మధ్యలోని వరద కాల్వ సమీపంలో అక్రమంగా నిలువ చేసిన ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. బత్తుల లచ్చయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మహిళలకిచ్చిన హామీలు అమలు చేయాలి

- సహాయత మహిళా సేవా సంస్థ జిల్లా కన్వీనర్ ప్రభావతి

కలెక్టరేట్, జూలై 13 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తెలంగాణ మహిళలకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సహాయత మహిళా సేవా సంస్థ జిల్లా కన్వీనర్ ఎ. ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని లక్ష్మీనగర్‌లో గల తమ కార్యాలయంలో మహిళలకు కుట్లు, అల్లికలు, ఇతర రంగాల్లో ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమంటూ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం మినహా చేసిందేమీ లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు నెలకు రూ.2,500 విడుదల చేయాలని, పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో ఆడకూతురు వివాహానికి రూ.లక్షతో పాటు తులం బంగారం దరఖాస్తు చేసుకున్న వారందరికీ అందజేయాలని, కళాశాలలకు వెళ్లే బాలికలకు స్కూటీలు, రూ.5లక్షల విద్యార్థి కార్డులు పంపిణీ చేయాలన్నారు. మాట తప్పితే రాబోయే రోజుల్లో మహిళలు సంఘటితమై తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు రాధిక, వంచ లక్ష్మి, నాయిని హేమలత, రమాదేవితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తెలంగాణచౌక్, జూలై 13: పెండింగ్‌లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్‌ను విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏడు వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు అవుతున్నా ఇప్పటి వరకు విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించకపోవడం విద్యారంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తున్నదని విమర్శించారు. ఎన్నికల్లో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేస్తామని వాగ్దానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పటి వరకు విద్యాశాఖకు మంత్రిని నియమించలేని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దశలవారీగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నగర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

'జీపీ కార్మికులతో కాల్వ పనులు'

కొత్తగట్టులో ఎస్సారెస్పీ కాల్వలో చెత్త తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

శంకరపట్నం, జూలై 13: పంచాయతీ కార్మికులతో ఎస్సారెస్పీ కాల్వ పనులు చేయించడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీరాజ్ అధికారులు కొత్తగట్టు గ్రామంలో పంచాయతీ కార్మికులతో ఎస్సారెస్పీ కాల్వలో చెత్త తీయించారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను అందజేశారు. పంచాయతీ కార్మికులను కేవలం గ్రామంలోని పారిశుధ్య పనులకు వినియోగించుకోవాలని తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.